క్లుప్తంగా

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న లీగల్ సెల్ సెక్రటరీ జడ్జి దీప్తి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ సెక్రటరీ జడ్జి బి.దీప్తి ముఖ్య అతిథిగా హాజరై వివిధ చట్టాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చందా శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న నాయకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 124వ రోజు మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

నల్లగొండ టౌన్ : మెడికల్ కళాశాల కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలలు దాటినా నేటికీ వేతనాలు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ.జకీర్, అండాలు, చంద్రమ్మ, స్వర్ణ, జానయ్య, విజయ, రేణుక, కవిత, కోటేశ్వరీ, సీత, లక్ష్మి, శిల్ప, జమీర్, శ్రీను, కృష్ణవేణి, కరుణ, ఇద్దమ్మ, మంగమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

చిట్యాల : చిన్నపిల్లల శారీరక, మానసిక ఎదుగుదల కోసం సరైన పోషకాహారం అందించాలని వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి నర్సింహారావు తెలిపారు. మంగళవారం 16మంది విద్యార్థులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లోపం ఉన్న చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. న్యూట్రిషన్ ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకట్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పోలీస్ శాఖ పెద్ద పీట

నల్లగొండ క్రైం : మహిళల భద్రతకు పోలీస్‌శాఖ పెద్దపీట వేసిందని షీటీం ఇన్‌చార్జ్ సీఐ రౌతు గోపి అన్నారు. మంగళవారం పట్టణంలోని పానగల్ హైస్కూల్ విద్యార్థులకు షీటీం, పోలీస్‌లు, మహిళ భద్రత, రక్షణ, భరోసా అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు వెళ్తున్న సమయంలో, బస్టాండ్‌ల వద్ద ఎవరైనా వేధిస్తే షీటీం పోలీస్‌లకు వాట్సాప్ ద్వారా, 100 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ప్రేమించాలని వెంటపడడం, ఫొటోలు తీసి మార్ఫింగ్ చేసి బెదిరిస్తే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియాలో తెలియని వారు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేస్తే అంగీకరించద్దని అన్నారు. యుక్త వయసులో కుటుంబ సభ్యుల సూచన ప్రకారం నడుచుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. షీటీం పోలీసులు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గస్తీలో ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయలక్ష్మి, భరోసా కో ఆర్డినేటర్ నళిని పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల : వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి జి.కిరణ్, కౌన్సిలర్ సిలువేరు మానికేశ్వర్ కోరారు. మంగళవారం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పూలకుండీలు, తొట్లలో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ దాసరి నర్సింహ, బెల్లం క్రాంతికుమార్, గండమల్ల శంకర్, మహ్మద్ యాసిన్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తీరిన తండావాసుల కష్టాలు

- ఏళ్లుగా ఇబ్బందిపడిన జాన్‌తండా, దొరోనిగడ్డ తండావాసులు
- ఉప ఎన్నిక హామీలో భాగంగా బీటీ రోడ్డు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



జాన్‌తండాకు వేసిన బీటీ రోడ్డు

నాంపల్లి : మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ నాయకులు తండావాసులకు ఇచ్చిన హామీలను నాంపల్లి మండలంలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. నాంపల్లి మండలంలోని జాన్‌తండా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటయింది. కానీ తండాకు వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా ఉండడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతూవచ్చారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా తండాకు బీటీ రోడ్డు వేయిస్తామని బీఆర్ఎస్ నాయకులు హామీ ఇచ్చారు. ఇటీవల తండాకు బీటీ రోడ్డు వేయడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తండాలో సుమారు 150 కుటుంబాలు 500 మందిపైగా జీవనం సాగిస్తున్నారు.

కంకర రోడ్డుతో నిత్యం కష్టాలే..

జాన్‌తండా, దొరోనిగడ్డ తండాల నుంచి నిత్యం నాంపల్లి, చండూర్ మండలాలకు 67 మంది విద్యార్థులు సైకిల్, స్కూల్ బస్సుల్లో పాఠశాలలకు వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయమై పూర్తిగా కంకర తేలడంతో స్కూల్ బస్సులు సైతం తండాలకు రావడానికి ఇబ్బంది అయ్యేది. తండా నుంచి 2 కిలోమీటర్లకు పైగా దూరం విద్యార్థులు నడుచుకుంటూ ప్రధాన రోడ్డు వరకు వెళ్లి ఆటోల్లో పాఠశాలలకు వెళ్లేవారు. వర్షకాలంలో నరకయాతన పడి పలు ప్రమాదాల బారిన పడేవారు.

రూ.కోటి 25లక్షల నిధులు మంజూరు

మునుగోడు ఉప ఎన్నిక సమయంలో జాన్‌తండా, దొరోనిగడ్డ తండాలకు బీటీ రోడ్డు వేయిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. హామీలో భాగంగా జాన్‌తండా తండాకు 2 కిలోమీటర్ల 200 మీటర్ల దూరం రోడ్డుకు ప్రభుత్వం రూ.కోటి 25 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో 1.6 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గ్రామ శివారులో వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉండడంతో నిధులు సరిపోలేదు. దీంతో మిగతా రోడ్డుకు అధికారులు ఎస్టిమేషన్ వేసి పంపించారు. నిధులు మంజూరు రాగానే మిగతా రోడ్డు పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

రోడ్డు వేస్తేనే ఓట్లు వేస్తామని..

మునుగోడు ఉప ఎన్నిక తండావాసులకు వరంగా మారింది. రోడ్డు వేసే వారికే ఓట్లు వేస్తామని లేకుంటే వేయమని తండావాసులు తేల్చి చెప్పారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే తండాకు బీటీ రోడ్డు వేయిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు ఒక్కటై కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేశారు. గెలిచిన నాలుగు నెలల్లోనే రోడ్డు పనులు ప్రారంభించి ఇటీవల పూర్తి చేశారు. ఇచ్చిన హామీ పూర్తి చేయడంతో తండా ప్రజలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఇబ్బందులు తొలిగాయి



గతంలో రోడ్డు సౌకర్యం లేక తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉప ఎన్నిక సందర్భంగా తండాలకు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు పూర్తి కావడంతో ప్రజల ఇబ్బందులు తొలిగాయి. తండాకు రోడ్డువేసి ప్రజల కష్టాలు తీర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–సపావత్ తస్లీ, జాన్‌తండా సర్పంచ్

హామీలు ఇచ్చి వెళ్లేవారు



కొన్ని ఏళ్లుగా తండాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం వచ్చి హామీలు ఇచ్చి వెళ్లేవారు. కానీ ఎవరు కూడా రోడ్డును బాగుచేయలేదు. కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేయడంతో గ్రామానికి రోడ్డు మార్గం పూర్తయింది.

–సపావత్ పాష, జాన్‌తండా

తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం



కంకర, గుంతలు ఉన్న రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డు బాగు వేస్తేనే ఓట్లు వేస్తామని నాయకులకు చెప్పడంతో వారు హామీ ఇచ్చారు. ఓట్లు వేసి రోడ్డును బాగుచేసుకున్నాం. దీంతో మా తండాలకు ఇబ్బందులు తొలిగాయి.

–సవవత్ టక్కీ, గ్రామస్తురాలు

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మర్రిగూడ : డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు



కట్టంగూర్ : వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

కట్టంగూర్ : తమను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని రెండో ఏఎన్ఎంలు మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో 15 సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను ఎత్తివేసి రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి మోసం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.శకుంతల, జి అరుణ, జి.వరలక్ష్మి, కె మంజుల, ఎం భవాని, పి.మంజుల, టి సంతోష పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి

మర్రిగూడ : కాంట్రాక్ట్ విధానంలో 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని రెండో ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయకుంటే సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కొండల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మి, సునీత, సరిత, హైమీన్, అరుణ, జ్యోతి, అరుణ, మేరిలు పాల్గొన్నారు.

నేడు వేముల వీరేశం ఆత్మీయ సమ్మేళనం

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టికెట్ రాకుండా పార్టీ అన్యాయం చేసిందని, అందుకు బుధవారం నకిరేకల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి తన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హాజరై తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

27న మున్నూరు కాపు ప్లీనరీ

మునుగోడు : ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే మున్నూరు కాపుల ప్లీనరీకి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు జడిగం అమర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రానున్న ఎన్నికల్లో మున్నూరు కాపులకు అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్‌తో చేపడుతున్న ప్లీనరీకి అధిక సంఖ్యలో హాజరై మున్నూరు కాపుల ఐక్యతను చాటాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న బోళ్ల నర్సింహారెడ్డి

కేతేపల్లి : అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇంటి స్థలంలో ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం సీనియర్ నాయకుడు బోళ్ల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కొత్తగా పెళ్లైన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఇరుకైన ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.3 లక్షలు ఏమాత్రం సరిపోవని, ప్రతి ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, కోట లింగయ్య, గుండగాని శ్రీను, నాగయ్య, చెరుకు సత్తయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు జియో ట్యాగ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాపోలు ప్రభాకర్

చండూరు : అర్హులైన చేనేత కార్మికులందరికీ జియో ట్యాగ్ నంబర్లు కేటాయించాలని చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం చండూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చండూరులో కొందరు కార్మికులు మగ్గాలు కలిగి ఉన్నప్పటికీ జియో ట్యాగ్ నంబర్ లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే టై అండ్ డై చేస్తున్న కార్మికులకు కూడా జియో ట్యాగ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత పరిరక్షణ సేవా సమితి ఉపాధ్యక్షులు ఏలె శ్రీనివాస్, రాపోలు వెంకటేశం, సంగెపు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు కర్నాటి శ్రీనివాసులు, చెరిపల్లి కృష్ణ, సహాయ కార్యదర్శులు వర్కాల విజయ్‌కుమార్, రావిరాల అశోక్, చెరిపల్లి నరేష్, కోశాధికారి కర్నాటి యాదయ్య, అధికార ప్రతినిధి రాపోలు జగదీశ్వర్, ముఖ్య సలహాదారు చెరుపల్లి వెంకటేశం, హైదరాబాద్ ఇన్‌చార్జ్ చిలుకూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటాం



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కట్టంగూర్ : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి సీపీఎం బరిలో నిలుస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి తెలిపారు. మంగళవారం కట్టంగూర్‌లో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వతంత్రంగా పోటీ చేయాల్సి వస్తే సీపీఎం అభ్యర్థి పోటీలో ఉండడం ఖాయమన్నారు. పొత్తులో భాగంగా నకిరేకల్ స్థానం ఇవ్వాల్సి వస్తే పార్టీ నిర్ణయం ప్రకారం వదులుకుంటామన్నారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధమై అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, మండల కమిటీ సభ్యులు చిలుముల రామస్వామి, మురారి మోహన్, ఇటుకల సురేందర్, గడగోజు రవీంద్రాచారి, కక్కిరేణి రామస్వామి, ఊట్కూరి యాదయ్య, జాల రమేష్, మల్లేష్, శ్రీను, నాగయ్య, సత్తయ్య ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం



రామును సన్మానిస్తున్న సూర్యతేజ

నల్లగొండ టౌన్ : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎస్ఎఫ్ బ్యాటరీ యాజమాన్యం ముందుంటుందని ఎస్ఎఫ్ బ్యాటరీస్ తెలంగాణ రీజినల్ సేల్స్ మేనేజర్ రాము అన్నారు. మంగళవారం స్థానికంగా జరిగిన ఎస్ఎఫ్ బ్యాటరీస్ డీలర్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాణ్యత పాటిస్తూ బ్యాటరీలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరిస్తూ ఎస్ఎఫ్ బ్యాటరీస్ యాజమాన్యం ముందుకు సాగుతోందన్నారు. డీలర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య బ్యాటరీ ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ కనగాల సూర్యతేజ, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ బాలాజీ, సర్వీస్ హెడ్ వెంకట్రావ్, డీలర్లు పాల్గొన్నారు.

దైద రవీందర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న నూకల రఘునందన్‌రెడ్డి

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ దైద రవీందర్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు కోరారు. మంగళవారం నకిరేకల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత నూకల రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ దైద రవీందర్ ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తూ పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో గార్లపాటి రవీందర్ రెడ్డి, బాదిని సోమయ్య, రంగు వీరయ్య, కొల్లు నర్సింహ, చింత పున్నయ్య, సందినేని వెంకటేశ్వర రావు, ఆంజనేయులు, బండ వెంకట్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, రాజేష్, మాచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని నియమించాలి

శాలిగౌరారం : ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి పీఆర్‌సీ గడువు ముగిసినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకాలేదని, రెండో పీఆర్‌సీ కమిటీ నేటికీ నియామకం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వేతన సవరణ కమిటీని నియమించి ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని, అదేవిధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, రాకేశ్, రాములు, రఫీ, శంకర్, రవికుమార్, లింగారెడ్డి, యాదగిరి, శ్రీనివాసాచారి, చక్రపాణి, సైదులు, శ్రీహరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్‌కు అర్హులను ఎంపిక చేయండి



కాంట్రాక్టర్, అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూ టౌన్ : ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికెళ్లి పూర్తిగా విచారించి అర్హులను ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీన పట్టణంలోని వివిధ కాలనీల్లో 10,000 మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించేలా మెప్మా సిబ్బంది ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నీలగిరి పట్టణంలోని వీటీ మార్కెట్లో నిర్మిస్తున్న మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు . ప్రహరీ, రంగులు, విద్యుత్ తదితర పనులన్నీ పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాగిరెడ్డి, డీఈ వెంకన్న తదితరులు ఉన్నారు.

ఓటరు ముసాయిదాలో తప్పులు సరిచేసుకోవాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దామోదర్‌రావు

చండూరు : గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు ముసాయిదాల్లో ఎలాంటి తప్పులు ఉన్నా సరిచేసుకోవాలని మునుగోడు నియోజకవర్గ ఎన్నికల అధికారి కే.దామోదర్‌రావు సూచించారు. మంగళవారం చండూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26, 27, వచ్చే నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గతంలో 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 307 కు పెరిగాయన్నారు. చౌటుప్పల్‌–4, గట్టుప్పల మండలంలో 1, చండూరు మండలంలో 1, నాంపల్లి మండలంలో 3 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. ముసాయిదాల్లో ఓటు వేరొక బూత్‌లో పొరపాటుగా నమోదైతే బీఎల్‌ఓల ద్వారా మార్పిడి చేసుకోవచ్చన్నారు. ఏదైనా కారణాల వల్ల ఓటు నమోదు కాకపోయినట్లయితే మళ్లీ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దీపక్, సీనియర్ సహాయకులు సైదులు, ఎర్రజెల్ల లింగయ్య, షరీఫ్, ప్రభుదాస్, ధనంజయ్, పెద్దగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన



కనగల్ : అవగాహన కల్పిస్తున్న అధికారులు



నార్కట్‌పల్లిలో..

కనగల్ : మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై మంగళవారం సర్పంచ్ బొగరి రాంబాబు, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విఘ్నేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బత్తుల నరహరి, గ్రామస్తులు సైదిరెడ్డి, తిరుమల్, లింగయ్య, భుజంగం తదితరులున్నారు.

నార్కట్‌పల్లి : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌తో ఓటు వేసే విధానంపై మంగళవారం మండలంలోని చిన్ననారాయణపురం, నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీల్లో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దూదిమెట్ల శ్రీనివాస్, అజాంఖాన్, బూత్ లెవెల్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో ఎన్జీ విద్యార్థుల ప్రతిభ



సుమ



భూపతి



శ్రీవాణి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ స్టేట్ కామన్ పీజీ సెట్ ఎంట్రెన్స్–2023 ఫలితాల్లో నల్లగొండ ఎన్జీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థిని సుమ ఎంఎస్సీ జియాలజీలో రాష్ట్రస్థాయి 1వ ర్యాంకు సాధించింది. జియాలజీలో భూపతి 10 ర్యాంకు, ఆర్కియాలజీలో లక్ష్మణ్ ప్రభు ఆకాష్ 13వ ర్యాంకు, ఫిజిక్స్‌లో శృతి 26వ ర్యాంకు సాధించారు. లైబ్రరీ సైన్స్‌లో శ్రావణి 27, జియాలజీలో భావన 27, స్టాటిస్టిక్స్‌లో అమూల్య 29, జియో ఇన్ఫర్మేషన్‌లో భూపతి 52వ ర్యాంకు సాధించారు. ఫిలాసఫీలో వెన్నెల 56, జాగ్రఫీలో సంజిత్ కుమార్ 73, జువాలజీలో మనీషా 77, కెమిస్ట్రీలో అన్నమయ్య 78వ, కంప్యూటర్ సైన్స్‌లో గౌతమ్ 84వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా కౌనిస్ బయోటెక్నాలజీలో 85, దుర్గాభవానీ హిస్టరీలో 100, శృతి బోటనీలో 122, సిద్ధిక్ ఎకనామిక్స్‌లో 130, మల్లిక మైక్రో బయాలజీలో 157వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్, వైస్ ప్రిన్సిపాల్ మునీర్, శ్రీనివాసులు, అధ్యాపకులు లైబ్రేరియన్ ఏ.దుర్గా ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

‘డయల్ యువర్ డీఎం’కు సమస్యల వెల్లువ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్‌కు పలువురు ప్రయాణికులు, ప్రజలు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు పలు సమస్యలను వివరించారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో నైట్ హాల్ట్ చేసే మిర్యాలగూడ డిపో బస్సుల్లో కొన్నింటిని మియాపూర్ వరకు పొడిగించాలని, మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్లే బస్సులను చిల్లేపల్లి స్టేజి వద్ద ఆపాలని, హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వచ్చే సూపర్ లగ్జరీ బస్సులు నల్లగొండకు వెళ్లకుండా నేరుగా మిర్యాలగూడకు వచ్చేలా చూడాలని, మిర్యాలగూడ నుంచి దేవరకొండకు వెళ్లే బస్సులు తుంగపహాడ్ స్టేజీ వద్ద నిలిపేలా చూడాలని పలువురు ప్రయాణికులు కోరారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో లోకల్ బస్సులు నడపాలని, మాడుగులపల్లి నుంచి పాములపహాడ్ మీదుగా మిర్యాలగూడకు బస్సులు నడిపించాలని కోరారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీతో పాటు ఆదాయం వచ్చే గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

మిర్యాలగూడ టౌన్ : కుమ్మరి శాలివాహన సంఘం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నల్లగొండలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు చేతులమీదుగా లక్ష్మీనారాయణ నియామక పత్రం అందుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కుమ్మరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చెర్వుగట్టు ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దాతలు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చర్లపల్లికి చెందిన నాగిళ్ల అంజయ్య–యాదమ్మ కుమారుడు నాగిళ్ల ప్రవీణ్‌కుమార్ 15వ వర్ధంతి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పన్నాల సుధీర్‌కుమార్, పద్మ, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో ..

నకిరేకల్ : లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్‌లోని వీవీఎం ఎయిడెడ్ పాఠశాలలో క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ మారిడి చంద్రశేఖర్ తల్లి పెద్దమ్మ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు వంటిపాక సోమేష్, ప్రతినిధులు కందాల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సైదులు మారిడి ప్రేమ, బ్రహ్మదేవర రమేష్, ఉపాధ్యాయులు భద్రయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు